# అపురూపం

"నీ అందం నన్ను బందీని చేసింది. అది మహా చెడ్డది. అందుకే అది ఎక్కడికీ పోకుండా నిత్యమూ నా ఎదురుగుండానే నర్తిస్తూ నా హృదయంలోనే నిలిచిపోయేలాగ చిత్రలేఖనంలో బంధిస్తున్నా. మొన్న సోమవారంతో పూర్తి అయింది నీ బొమ్మ గియ్యడం - అయితే అందమైన నీ కనుబొమలు సరిగ్గా అమరడంలేదు. అక్కడికే వచ్చి నిన్ను ఎదురుగా పెట్టుకుని అవి పూర్తి చెయ్యాలి. ఎప్పుడు వస్తావు అంటున్నావా - ఇదిగో - రేపటితో పరీక్షలయిపోతే రేపు సాయంత్రమే బయలుదేరి, ఎల్లుండి అంటే సంవత్సరాది నాడు తెల్లవారేసరికి ఈ దీనుడు నీముందు వాలడూ?... వస్తా - నీ శేఖర్ బావ"

ఉత్తరం చదవడం పూర్తిచేసి రేవతి వలవలా ఏడ్చింది. బావ రేపే వస్తున్నాడు. తనమీద ఎన్ని ఆశలు పెట్టుకుని వస్తున్నాడో! ఈ స్థితిలో ఉన్న తనను చూస్తే ఏమయిపోతాడు? అతని బాధ తను చూడలేదు నిరాశామయమైన బావ ముఖంలోని వేదన చూసి తను భరించలేదు. ఈ లోగానే తను ఈ లోకంలోంచి తప్పుకోవడం మంచిది - అవును - అదే మంచిది.

రెండు మూడేళ్ళ క్రితం అమ్మ పోయినప్పుడు కూడా తను ఇల్లాగే అనుకుంది చనిపోదాం అని. చనిపోయిందా?...

ఆఁ! అది వేరు... అప్పుడు శేఖర్ బావా, వదినా, అత్తా వాళ్ళూ, నిరాశతో ఆరిపోతూన్న తన జీవనజ్యోతికి ఆశ అనే ఇంత చమురు పోశారు. ఆ ఆశతో ఇన్నాళ్ళూ బ్రతికాను. ఇప్పుడు ఏ ఆశ చూసుకుని బ్రతకడం? ఎన్నాళ్ళీ భారమైన బ్రతుకుని ఈడ్చడం.

ఈ ఆలోచనలతో రేవతికి గతం అంతా ఒక్కమారు స్మృతిపథంలో మెదిలింది.

అప్పటికింకా అమ్మ పోయిన బాధ హృదయంలో ప్రతి నిముషం కలుక్కుమంటూనే ఉంది. అమ్మ తిరిగిన ఇంట్లోని ప్రతివస్తువూ అమ్మనే జ్ఞాపకం చేస్తున్నాయి. ఆమె పెంపకంలో కొత్త చిగుళ్ళువేసి ఏపుగా పెరిగి పూలుపూసిన లతలూ, పళ్ళుకాసిన చెట్లూ అన్నీ తెల్లారేటప్పటికి మంచు కన్నీళ్ళతో తలలూపుతూ తనతోపాటు ఏడుస్తున్నాయి. మాటిమాటికీ అమ్మని తలుచుకుని 'అంబా' అని అరుస్తూ, కళ్ళనిండా నీరు కారుతూంటే మేత ముట్టుకోక కట్రాడ చుట్టూ అలంగం తిరుగుతోంది ఆవు. వాటి ఆ వేదన చూడ లేక నేనూ, నా బాధ చూడలేక అవీ హీనంగా బిట్టుగా ఏడిచాం.

ఇంతమందినీ వదిలి మమకారపు తెర చీల్చుకొని ఎందుకు వెళ్ళిపోయావమ్మా! ఎక్కడికి వెళ్ళిపోయావు? అంటూ బావురుమని ఏడుస్తూన్న నన్ను తన చేతుల్లోకి తీసుకొని నాన్నగారు "అమ్మా!...నాతల్లీ... రేవతీ...అమ్మ లేదమ్మా మనకింక" అంటూ గట్టిగా ఏడ్చేశారు.

మా ఇద్దరి ఏడుపూ విని అత్తయ్యా మావయ్యా కంగారుగా వచ్చి "అబ్బే! ఇల్లా అయితే లాభంలేదు. నీ బాధ కొంచెం ఉపశమించేదాకా అమ్మాయిని మేంతీసుకు పోతాం - అక్కడ సుందరీ శేఖర్‌లతో కలిసి కొన్నాళ్ళు తిరిగితే రేవతి మళ్ళీ మామూలుపిల్ల అవుతుంది" అంటూ తమతో నన్ను వాళ్ళ ఊరు తీసుకెళ్ళడానికి నిర్ణయించారు.

ఆత్మీయత కూడిన అత్తయ్య ఆదరణతో, అన్నీ అమర్చే మావయ్య అభిమానంతో, సుందరి వదిన పాడే మధురమైన వీణపాటలతో, ముఖ్యంగా శేఖరంబావ తియ్యని కబుర్లతో కొంతవరకూ నా బాధ ఉపశమించింది. అమ్మ జ్ఞాపకం వచ్చి ఉండుండి మనస్సులో కలుక్కుమంటూన్నా ముమ్మూర్తులా పోలికలోనూ అలవాట్లలోనూ అమ్మలాగే ఉండే సుందరి వదినా, ముప్ఫైఏ నలభై ఏళ్ళ క్రితం అమ్మ నడకలతో పులకితం అయి ఇవాళ అందంగానూ ప్రశాంతంగానూ కనిపిస్తూన్న ఆ చక్కని పల్లెటూరి వాతావరణం హృదయానికి శాంతిని ప్రసాదిస్తున్నారు.

అందరూ ప్రేమగా చూస్తూంటే హాయిగా ఉండే నాకు వాళ్ళలో ఏ ఒక్కరు నామీద జాలిగా ఉన్నారని తెలిసినా బాధ కలిగేది. నామనస్సు తెలిసిన ఆత్మీయులేమో అందుకే నన్ను ప్రేమగానే చూశారు కాని ఎప్పుడూ జాలిగా చూడలేదు ఎవళ్ళూ.

ఓరోజున మధ్యాహ్నంవేళ శేఖర్‌బావా, సుందరి వదినా, నేనూ హాల్లో పనసపండు కోస్తూ, పండగలకి మా అమ్మ ఇక్కడికి వచ్చినప్పుడు, చిన్న పిల్లలుగా మేం

ముగ్గురం ఎలా ఆడుకోనే వాళ్ళమో మాట్లాడుకుంటున్నాము. మావయ్య గుర్రు పడమటింట్లోంచి వినిపిస్తోంది. అవతలి వసార్లో కొంగు పరుచుకొని గడపమీద తల పెట్టుకుని నిద్ర పోతోంది అత్తయ్య. బయట వేసంకాలపు ఎండ ఫెళ్లున మాడ్చేస్తోంది. ఇంతలో పోస్టుమేన్ వచ్చి బావచేతిలో కవరు పెట్టి వెళ్ళాడు. కవరుపై ఉన్న అక్షరాలు పరిశీలిస్తూ- "సుందరికి - ఓహో - గోపాలం బావగారు కాబోలు" అన్నాడు.

వెంటనే వదిన బావచేతిలో కవరు లాక్కొని పరిగెట్టు కుని పెరట్లోకి పారిపోయింది. వాళ్ల ఆయన దగ్గర్నుంచి కవరు రాగానే వదిన ముఖంలోకి ఎంత సిగ్గు, మరెంత ఆనందం ముంచుకొచ్చింది?...ఈ పదిహేడేళ్ల జీవితం లోనూ ఇలాంటి సిగ్గు ఎప్పుడేనా వేసిందా నాకు? ఆ ఆలో చన వచ్చినందుకే నిజానికి నాకు సిగ్గేసింది.

ఇంతలో "ఇవిగో పనసతొనలు. వెండికంచంలో పెట్టు" అంటూ కావాలని తన దోసిలిని నా దోసిలికి తగి లిస్తూ మరీ పోశాడు బావ. ఒక్కసారిగా నా శరీరంలో విద్యుత్ ప్రవహించినట్లయింది. ఉలిక్కిపడ్డాను. తియ్యని బాధ ఏదో శరీరానికి దివ్యసుఖాన్ని ఇచ్చింది.

తన దోసిలిని నా దోసిలి స్పర్శనుంచి దూరంగా తీసుకుంటున్న బావకేసి చూడలేక, అలాగని ఆ స్పర్శ సుఖం దూరం అవుతూంటే భరించనూ లేక, అసలే కలల బరువుతో నిండిన కనురెప్పల్ని మరింత బరువుగా ఎత్తి బేలగా బావ కేసి చూశాను. "శేవతీ!" అన్నాడు బావ వణుకుతూన్న

కంఠంతో. బావ పిలుస్తూన్నది నన్నో నా హృదయాన్నో నిర్ణయించుకోలేక అలా అతనికేసి చూస్తూ ఉండిపోయా.

"చిన్నప్పుడు ఎంత చిలిపిగా ఉండేదానవు రేవతీ! జ్ఞాపకం ఉందా? "నాకస్సలే భయం - ఉయ్యాలా గట్టిగా ఊపకు" అంటే తోటలో చింతచెట్టు కొమ్మకి కట్టిన ఉయ్యాలా పగ్గాలట్టుకుని గట్టిగా ఊపుతూ "పిరికీ బావకి మిన్నేరు, కిందకి పడితే కన్నీరు - కాదని ఊగితే పన్నీరు" అంటూ పాడి నన్నేడిపించేదానివి. ఇప్పుడా చిలిపితనం అంతా ఏమైంది రేవతీ! ఈ మూగతనం ముగ్ధత్వం మా నెయ్యి...అమ్మ పోయినదన్న బెంగ ఇంకా పోలేదా నీకు? నీ మనస్సులోంచి ఆ బెంగని పోగొట్టలేకపోయానా? చెప్పు రేవతీ" అంటూ బుగ్గలుమీదుగా కారుతూన్న నా కన్నీళ్ళుతుడిచి, ఏదో చెప్పబోయి, తెరిచిన నానోట్లోకి పనస తొన కుక్కాడు. ఉక్కిరిబిక్కిరి అయి బావ చెయ్యి గట్టిగా అదిమి పట్టుకున్నా. నిద్రపోతున్న నా మనోభావాల్ని మేల్కొలిపి, బాధతో ఎండిపోయిన నా హృదయంపై అమృతపు జల్లులు కురిపించిన బావకి కృతజ్ఞతలెలా చెప్పుకోవాలో అర్థంకాక, చెక్కిలికి చెయ్యి ఆన్చి కళ్ళతో బావ అందాన్ని మింగుతూ గుటకలు వేస్తూన్న నన్నుచూసి "అమ్మదొంగా! తొన అంతా నువ్వు తినేస్తే ఎట్లాగ? సగం కొరికి నాకియ్యి" అంటూ ఆ ప్రేమఫలాన్ని చెరిసగంగా స్వీకరించాడు బావ.

ఇంతలో ఉత్తరం దాచేసి వదిన వచ్చింది "ఏం రాశాడే బావ?" అన్నాడు శేఖర్. "ఏం రాయలేదు" అంది

వదిన. "ఓహో-సంధిపత్రం తెల్లకాగితం పంపాడన్నమాట!" అని బావ నవ్వాడు. నేనుకూడా నవ్వాను. "నవ్వులో శ్రుతి కలిసింది కాని తాళంలేదు" అంది వెటకారంగా వదిన. "మా గోపాలం అన్నయ్య వచ్చి నీనోటికి తాళంవేస్తాడులే" "అబ్బో! మా రేవతివదిన ఇన్నాళ్ళకి నోటితాళం విప్పి వుందే! ఒక్క క్షణం క్రితందాకా ముద్దగాలవే!...ఎప్పటి నుంచే ఈ పొగరు?" "కొన్నాళ్లలో మా సుందరి వదిన పొగరు తగ్గబోతుందని తెలిసినప్పటినుంచీ."

ఇలా బావతోటీ, వదినతోటీ సరదాగానే కాలక్షేపం అయేది. బావలో నా ఆశల ఆలయాన్ని చూసుకుంటుంటే పురివిప్పిన నెమలిలా నా మనస్సు నర్తించేది.

కాలేజీలు తెరిచారు. ఈ ఫైనలియర్ జాగ్రత్తగా చదవకపోతే ఇంజనీరింగ్‌లో ఫస్ట్‌క్లాసు ఆనర్స్ రాదు అంటూ శేఖర్‌బావ ఆ మర్నాడే ప్రయాణం నిర్ణయం చేశాడు అత్తయ్య సాయంత్రం వంటకి ఆయత్తం అవు తోంది. తన స్నేహితురా లెవరో అత్తారింటినుంచి వచ్చిందని చెప్పి చూడడానికి వెళ్ళింది సుందరి వదిన. మావయ్య పొలం వెళ్లాడు.

బావ ప్రయాణం సంగతి వినినదగ్గర్నుంచీ మనస్సు అదోలాగ అయిపోయింది. రోజూలాగే అవతలి పెరట్లోకి వెళ్ళి ఒడినిండా మల్లెపువ్వులు కోసుకున్నాను. కాని "ఎందుకీ మల్లెపూలు" అనిపించింది. తోటలో ఉన్న చిన్న చెరువు దగ్గర కెళ్లాను యాంత్రికంగా. గట్టుమీద కూర్చుని పర ధ్యానంగా ఒక్కొక్క పువ్వే నీళ్లలో విసురుతున్నా.

అలా ఎంతసేపు కూచున్నానో తెలియదు. పువ్వులన్నీ అయిపోయాక తలెత్తి దూరంగా అస్తమిస్తున్న సూర్యుడికేసి చూశాను. సూర్యకాంతిలో మెరిసిపోతూ శేఖర్ బావ! నొక్కునొక్కుల జుట్టు – సన్నని పలువరుస – నీలిరంగు ఖద్దైన షర్టులోంచి కనిపిస్తూన్న తెల్లని దట్టమైన దేహకాంతి. ఏకాగ్రతగా నిలబడి ఏదో రాస్తున్నాడు.

బావని చూసి దిగ్గున లేచి నిలబడబోయాను. "కదలకు రేవతీ – కదలకు" అన్నాడు. కొంతసేపయాక ఆ రాసింది తీసుకువచ్చి నాకు చూపించాడు.

అందమైన కొలను. ఆ కొలనులో మల్లెలు తెట్టుగా తేలి గుట్టుగా గుసగుసలాడుకుంటున్నాయి. ప్రకృతిమాత సంధ్యాదేవికి పడమటిదిక్కున ఎర్రని నీరాజనమిస్తోంది. ఆ కొలను గట్టున ఆలోచిస్తూ కూచున్న నా బొమ్మ.

"ఈ అమ్మాయి ఎవరు బావా?" అన్నా ఏమీ ఎరగనట్టు.

పక్క చెట్టుమీంచి కోయిల సన్నాయి వాయించింది.

"ఆ అమ్మాయి నా హృదయేశ్వరిలే!" అన్నాడు.

చల్లని గాలి మేనికి సోకి హాయి అనిపించింది.

"ఎంత చక్కగా చిత్రించావు బావా!" అన్నా.

"మరి చక్కనివాళ్ళని చక్కగా చిత్రించవద్దూ – ఇదేం చూశావు – ఇది ఊరికే స్కెచ్. ఇది ఆధారంగా

రంగులలో నీ చిత్రాన్ని ఏడాది అంతా దీక్షగా కూర్చుని వేసి వచ్చే వేసవికాలానికి చూపిస్తా చూడు."

"అయితే ఈ ఏడాది అల్లా చదువు ఇదే అన్న మాట !"

"ఆ...అన్నట్టు రేపే నా ప్రయాణం రేవతీ!" అన్నాడు బావ.

నేను దిగులుగా బావకేసి చూశా.

నన్ను దగ్గరగా తీసుకుంటూ "ఎంత ? తొమ్మిది నెలలలో తిరిగిరానూ ?... ఇన్నాళ్ళూ నీ రూపం నా దగ్గరే ఉంటుంది కనుక నువ్వు నాకు దూరంగా ఉన్నట్లు కాదు"

"నీకు సరే - నా బొమ్మ ఉంటుంది - మరి నాకో !" అన్నా.

"నీకు వారానికో ఉత్తరం రాస్తానుగా - అంటే ప్రతి ఉత్తరంతోటీ నేనుకూడా నీ దగ్గర కొస్తానన్నమాట. అన్నట్టు నీకు వచ్చిన ఉత్తరాలని మావయ్య...?"

"ఎప్పుడూ చూడరు - నీకా భయం అక్కర్లేదు. ఆ వంకని రాయడం మానేశావు కనక ?" అన్నాను.

"ఎందుకు మానేస్తాను రేవతీ!" అని బావ నా బుగ్గలు నిమిరి నన్ను గాఢంగా హత్తుకున్నాడు,

బావ గుండెలమీద తల ఆన్చి ఈ లోకాన్నే మరిచి పోయి కొంచెంసేపుండి ఆ తర్వాత "నా బావ" అన్నాను నాలో నేను అనుకున్నట్లుగా.

"అవును. నేను ఇప్పుడేకాదు ఎప్పటికీ నీవాడనే?"...

మరి వస్తా – మళ్ళీ అందంలో నీతో పోటీచేసే నీ బొమ్మని తీసుకొనే నీకు కనిపించడం – అందాకా అందమైన నీ కనుబొమలు మన్మధుడు ఎక్కుపెట్టిన బాణాల్లా నన్ను తరుముతూనే ఉంటాయి" అన్నాడు.

బావ తియ్యని మాటలు మత్తుగా నా చెవులికి వినిపించాయి. ఆ మత్తులోంచి నేను తేరుకొనే రోజుకి బావ పట్నం వెళ్ళిపోయాడు చదువుకని. బావ లేని ఊళ్ళో ఉండ లేక నేను తిరిగి మా ఊరు వచ్చేశా నాన్నగారి దగ్గరికి.

వచ్చి చూస్తే ఈ రెండు మూడు నెలలలోనూ మా యింటి పరిస్థితులలో విపరీతమైన మార్పులు వచ్చినట్లు కనిపించాయి. ఇల్లు అంతా తనదే అన్నట్లు ప్రవర్తిస్తూన్న ఓ నలభై ఏళ్ల స్త్రీ, మొదట వంటమనిషి ఎవరో అనుకున్నా. నామీదా, నాన్నగారిమీదా కూడా ఆవిడ పెత్తనం చెలాయించడం, నాన్నగారు ఆమెనేం అనకపోవడం చూస్తే నా ఊహ తప్పని తెలిసింది. నాన్నగారుకూడా నాతో మనస్సు విప్పి 'ఇదీ' అని ఏం చెప్పలేదు. ముక్తసరిగా ఉంటూ వచ్చారు. పరిస్థితులు చూడగా చూడగా నాకు భయం వేయసాగింది. మా అమ్మలాంటి పవిత్రమూర్తి ఆక్రమించవలసిన స్థానాన్ని ఈవిడ ఆక్రమించి ఈ దేవాలయాన్ని అపవిత్రం చేస్తోందనిపించింది. నా కావిడమీద అపరిమితమైన అసహ్యం వేయసాగింది.

దానికితోడు ఇంట్లో ఆవిడ తమ్ముడొకడు, ఖరీదైన బట్టలూ, నోట్లో చుట్టా, పల్లెటూరి యాస, నా కేసి ఓరగా చూస్తూండడం, ఇల్లంతా తన తాతగారి సొమ్ము అన్నట్లు

వీరవిహారం చేస్తూ తిరగడం - నాకు వాడిని చూస్తే ఓ పక్కనుంచి నవ్వు, మరోక పక్కనుంచి భయం రా సాగాయి. పాతికేళ్ల ఆ మొద్దబ్బాయిని చంటాడు అని ఆవిడ పిలుస్తూంటే నవ్వొచ్చేది.

ఆ చంటాడికీ నాకూ కలిపి అన్నం పెట్టడానికి ప్రయత్నించేది. తరుచు వాడున్న చోటికి నన్నూ, నేనున్న చోటికి వాణ్ణీ పంపుతూండేది. వాడితో నవ్వుతూ ఉండమనేది. తుదకు ఓ రోజున వాడే నాకు కాబోయే భర్త అని సూచించింది. నేను ఆవిడ మాటలని పట్టించుకుని అంత భయపడి ఉండకపోదును నాన్న కనక నాతో పూర్వంలాగ చనువుగా మాట్లాడుతూ ఉంటే. నాకు అదీ కరువైంది. అన్ని వేపులా చీకటిగా మారుతూన్న నా జీవితానికి అప్పుడప్పుడు బావ దగ్గర్నుంచి వచ్చే ఉత్తరమే వెలుగుకిరణం ప్రతీ ఉత్తరంలో నా ఆరోగ్యం గురించి ప్రస్తావించి నా బొమ్మ వెయ్యడం ఎంతవరకూ వచ్చిందీ రాస్తూ ఉండేవాడు. ఇక్కడి నా పరిస్థితులన్నీ పూసగ్రుచ్చినట్లు బావకి రాసి ఉందును. కాని ఇంతలో ఓ రోజున మావయ్య వచ్చి కూచుని యథాలాపంగా మాట్లాడుతూ, చెల్లెలుకూతుర్ని తమ్ముడుకొడుక్కిచ్చి పెళ్లి చేస్తే ఎదురు మేనరికం అవుతుందనీ చస్తే తను దానికి ఒప్పుకోననీ ఖరాకండీగా నాన్నతో అని వెళ్లాడు ఇంక తను తన కొడుక్కి నన్ను చేసుకుంటాడా వెఱ్ఱిమాట! అటువంటి తండ్రిని కాదని శేఖర్ మాత్రం నన్ను పెళ్లి చేసుకుంటాడా? ఒకవేళ చేసుకుంటే మాత్రం ఏం సుఖపడతాడు? అలాగని శేఖర్‌ని తను మరిచిపోగలదా? ఏమో - ముందు ఏది ఎలా

జరిగినా ప్రస్తుతం మాత్రం నా పరిస్థితి అతనికి రాసి వేదన కలిగించడం మాత్రం విజ్ఞత కాదు.

ఇలా ఉండగా ఇంట్లో పరిస్థితులు మరీ విషమరూపం తాల్చడం మొదలుపెట్టాయి. నీళ్లు తోడడం, పిండి రుబ్బడం, వంట వండడం దగ్గర్నుంచి అన్ని పనులూ నేనే చెయ్యవలసి వచ్చింది. ఆవిడ సన్నచీరలూ, మెలికిసిగలూ వీటిలో పడిపోయింది. నేనేమీ చెయ్యనని మొండికేత్తితే ఇంట్లో పెద్ద అల్లరయేది. నాన్న కలగచేసుకొనేవాడు కాదు. ఇంక ఏంచెయ్యను. ఆవిడ ఇంటి యజమానురాలయి, నేను వంట లక్క నయాను.

ఇలా ఉండగా పదిహేనురోజుల క్రితం సాయంత్రం సమయంలో నాన్నని తీసుకొని ఓరోజున బంగారపుగొలుసు చేయించుకోవడంకోసం ఆవిడ బజారుకి వెళ్లింది. వెళ్లేటప్పుడు ఆ చంటాడికి ఏంచెప్పిందో ఏమో, నేను అన్నం వారు స్తూండగా వీధితలుపు గడియవేసి వచ్చి నా వీపుమీద చెయ్యివేశాడు నేను ఉలిక్కిపడి చూశాను.

వాడు వెకిలిగా నాకేసి చూసి నవ్వాడు. నాకు పరి స్థితి అర్థం అయింది. భయం, కోపం, ఆవేశం ఒక్కసారి విజృంభించాయి నాలో. చేతిలో ఉన్న గిన్నె చెయ్యిజారి పోయింది. ఆవిరి అంతా ఒక్కమారు గుప్పున మొహానికి కొట్టింది. దానికితోడు గాలికెగిరిన పైట మండుతూన్న పొయ్యి మంటకి అంటుకొని రివ్వున వచ్చి మొహంమీద పడింది. అంతే – తర్వాత ఏంజరిగిందో తెలియదు.

తెలివి వచ్చేసరికి మంచంమీద పడుకొని ఉన్నాను నీరసంగా. మొహం అంతా ఏదో బరువుగానూ, మంట గానూ ఉంది. నాన్నగారు దగ్గరగా మంచంమీద కూర్చుని "చంటాడిని చేసుకోవడం ఇష్టం లేకపోతే చెప్పొచ్చు కాదమ్మా - ఇంతమాత్రానికి బట్టలు అంటించుకొని గంజి మీద పోసుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేస్తావా ?" అన్నారు దీనంగా నా మొహంలోకి మొహం పెట్టి చూస్తూ.

"ఆత్మహత్యా ?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును తల్లీ - నాకు అంతా చంటాడు చెప్పాడు. వాడే కనక ఆరోజు ఇంట్లో లేకపోతే నువ్వారోజు మాకు దక్కేదానవు కాదు తల్లీ" అన్నారు నాన్న

ఎంత అబద్ధం! నేను చుట్టూ కళ్ళుతిప్పి చూశా. కాళ్ళదిక్కున నిలబడి బిక్కమొహంతో బతిమాలుతూ కనిపించాడు చంటాడు. నాకు జాలేసింది. దానికితోడు నన్ను బతికించి, శేఖర్ కి నేను దక్కేలాగ చేశాడే చంటాడు. దాంతో నాకతనిపై కృతజ్ఞతకూడా ఏర్పడింది "అవును- చంటాడు చాలా ఉపకారం చేశాడు" అన్నా.

నా మాటకి నాన్నా, ఆవిడా, చంటాడు ముగ్గురూ కూడా సంతోషించారు. "నీ కిష్టం వచ్చినవాడిని పెళ్ళి చేసుకో తల్లీ" అని నాన్న డగ్గుత్తికతో అన్న మాటలు నాకు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చాయి.

నా శేఖర్ కోసం నేను బతకాలి - చప్పున కోలుకో వాలి - నేను బతకాలి - నేను బతుకుతాను - ఇలా నేను

సంకల్పించుకోవడంతో చప్పునే కోలుకున్నాను. ఫరవాలేదు. కాని ఇంకా ముఖం మాత్రం బాధగా ఉంది. ఏదో పట్టీలతో కట్టినట్లు, మొహం అంతా బిగబట్టినట్లు అనిపిస్తోంది. ఎవర్ని అడిగినా అద్దం ఇయ్యడంలేదు ఓమాఱు మొహం చూసుకుందాం అంటే ఎవరూ లేని సమయం కనిపెట్టి చంటాడి నడిగాను. తటపటాయించి తటపటాయించి తెచ్చాడు మొత్తానికి. అద్దం చూసుకున్నాను.

కెవ్వున అరిచాను. వలవలా ఏడిచాను. నా పూర్వపు అందం అంతా ఏదీ! బావ పొగిడిన అందం అంతా ఏది? తెల్లగా కాలిపోయిన నా మొహం! నల్లగా మాడిపోయిన నా కనుబొమలు – అమ్మో – భయం – నా ముఖం నాకే భయంగా ఉంది. ఇది బావకి చూపించను – చూపించలేను. అందమైన నా బొమ్మని గీసుకుని ఆరాధిస్తున్న నా బావకి ఈ భయంకరమైన మొహాన్ని చూపించనా?...వద్దు... నాకీ బ్రతుకు వద్దు – ఇంతక్రితం కాదు – ఇప్పుడు చేసుకుంటాను ఆత్మహత్య – బావ రాకుండా, చేసుకుంటా – ఉత్తరం వచ్చింది – రేపే వస్తున్నాడు – ఈ లోగానే చేసుకుంటా – ఈ లోగానే చేసుకుంటా..." అనిఅరుస్తూన్న రేవతితో అప్పుడే లోపలికి వస్తూన్న శేఖర్ "ఏమిటి చేసుకునేది?" అన్నాడు తాపీగా పరధ్యానంగా "ఆ...త్మ ...హ..." అంటూనే శేఖర్ని చూసి దిగ్భ్రాంతురాలై వెంటనే మొహం రెండు చేతుల్తోటీ మూసుకుంటూ "వెళ్ళు బావా – నువ్వు నన్ను చూడలేవు – నీ రేవతి పేరు చెప్పి మిగిలింది ఆ బొమ్మ ఒక్కటే. ఆ అందం ఇప్పుడు లేదు నీ

రేవతిలో" అంటూ ఏడిచింది. శేఖర్ అనునయంగా దగ్గర కూర్చుని "ఇప్పుడే నాకు మావయ్య అంతా చెప్పాడు. నువ్వేం బాధపడకు. ఆ అందమైన బొమ్మ ఉంటే అది నిన్ను వెక్కిరిస్తున్నట్లు బాధపడతావు – పైగా నాకు అందం అక్కర్లేదు. నువ్వు కావాలి. అందుకే ఆ బొమ్మ చింపే శాను ఇప్పుడే. నువ్వే కావాలి రేవతీ నాకు" అన్న బావతో "బావా" అంది రేవతి బాధగా

"అపురూపమైన నీ రూపానికి రూపకల్పన చెయ్య డానికి ప్రయత్నించాను – అదే నేను చేసిన తప్పు – ఆ రూపాన్ని చింపేసి ఈ అపురూపాన్ని స్వీకరించడం ద్వారా నా తప్పుని దిద్దుకుంటున్నాను" అన్న శేఖరంబావ మాటలు అర్థంకాక అట్టే చూస్తూ ఉండిపోయింది రేవతి.